## యూడీఐడీ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు

జనగామ చౌరస్తా, మార్చి 26: సదరం సర్టిఫికెట్ల స్థానంలో కొత్తగా యూనిక్ డిజెబులిటీ ఐడెంటిటీ కార్డు(యూడీఐడీ)లను దివ్యాంగులకు జారీ చేయడానికి బుధవారం జనగామ జిల్లా ప్రభుత్వ దవాఖానలో దృష్టిలోపం కలిగిన ఐదుగురు దివ్యాంగులకు వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు హాజరై శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా యూడీఐడీ కార్డులను అర్హులైన దివ్యాంగులకు అందించనున్నట్లు తెలిపారు. పోస్టల్ శాఖ ద్వారా దివ్యాంగుల ఇళ్లకు కార్డులు పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ప్రద్మ ప్రభ, డాక్టర్ వసంత, డాక్టర్ ఈవీ రాజు, సృజన్ కుమార్, డీఆర్డీఏ డీపీఎం వినత, ఏపీఎం సురేందర్, అడ్మిన్ అసిస్టెంట్ రమేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

పాలకుర్తి, మార్చి 26 : రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్ద తండా శివారు సీత్యాతండాలో బుధవారం చోటు చేసుకుంది. బంధువుల కథనం ప్రకారం.. పెద్ద తండా శివారు సీత్యా తండాకు చెందిన ధరావత్ రమేశ్-రజిత దంపతుల కుమారుడు దేవేందర్(17) పాలకుర్తిలోని పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. దేవేందర్ బావి దగ్గర నుంచి తన స్నేహితుడి బైక్ తీసుకుని వస్తుండగా కొండాపురం శివారు దుర్గమ్మ గుడి సమీపంలో అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో దేవేందర్‌కు బలమైన గాయాలు కావడంతో చికిత్స కోసం దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. అయితే, దేవేందర్ బైక్ అదుపు తప్పి కిందపడ్డాడా? లేదా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, ఈ విషయంపై ఎస్సై దూలం పవన్‌కుమార్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## తమ్మడపల్లి(ఐ)లో అర్ధరాత్రి ఇంట్లో చోరీ

### బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరణ

జఫర్‌గడ్, మార్చి 26 : మండలంలోని తమ్మడపల్లి(ఐ) గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంటి తాళం పగులకొట్టి బీరువాలో ఉన్న 14.5 తులాల బంగారం, 24 తులాల వెండి, రూ.30 వేల నగదును గుర్తు తెలియని నలుగురు దుండగులు దోచుకెళ్లారు. ఎస్సై రాంచరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తమ్మడపల్లి(ఐ) గ్రామానికి చెందిన బుల్లె కుమారస్వామి మంగళవారం రాత్రి జీవాల కాపలా కోసం వెళ్లగా తన భార్య పారిజాతం ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటికి తాళం వేసి బయట నిద్రపోయింది. అర్ధరాత్రి సమయంలో నలుగురు దుండగులు వారి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, బీరువాలో దాచిపెట్టుకున్న 14.5 తులాల బంగారం, 24 తులాల వెండి, రూ.30 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంచరణ్ తెలిపారు.

## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

### 50 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పాలకుర్తి, మార్చి 26 : మండలంలోని దర్దేపల్లి శివారు దుబ్బతండాలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. బుధవారం ఎక్సైజ్ సీఐ బీ సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో తండాలోని గుగులోత్ విజయ ఇంటిపై దాడులు చేసి 50 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మల్లంపల్లి శివారు లచ్చు నాయక్ తండాలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ గుడుంబా తయారు చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లినర్**

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

**PLOT FOR SALE**

★ వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

**CHANGE OF NAME**

★I, KAKAVETI SWARNALATHA W/o KAKAVETI BHASKAR, R/o H.No. 2-10-361/1/4/101, Teachers Colony, Phase-II, Waddepally, Hanamkonda. T.G. Have changed my name from KAKAVETI BHARGAVI W/o KAKAVETI BHASKAR to KAKAVETI SWARNALATHA W/o. KAKAVETI BHASKAR for all purposes.
NTW-000

**LOST OF DOCUMENT**

I, Vasumathi Nyalakonda, W/o Late N.Manikya Rao, Aged: 71 Yrs, R/o 5-11-178/D/6, Swapnalok Complex, Naimnagar, Hanamkonda, Hanumakonda Dist., Giving paper advertisement in Related to Lost of Original Link Sale Deed No. 4731/1994 pertains to Open Plot No 2 in SY No. 59, Admeasuring 555.55 Sq.Yds at rekurthi Village, Karimnagar Dist. Lost document on 23-03-2025 near excise colony, Hanamkonda. If any body finds my above said sale deed, Pls
Call: 8099257551

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565


# ‘ఉపాధి’ని మింగేసిన మున్సిపాలిటీ

- ఉపాధిహామీ పనులు కోల్పోయిన మూడు గ్రామాల ప్రజలు
- ఏడాదిలో రూ.4.38కోట్ల ఉపాధికి మంగళం
- అప్పుకూడా పుట్టడం లేదని కూలీల ఆవేదన
- ప్రత్యామ్నాయం కల్పించాలని డిమాండ్




స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపల్ కార్యాలయం



వాగల్లులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 26 : మున్సిపాలిటిగా మారితే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని కొంత మంది సంతోషిస్తుంటే, మున్సిపాలిటీగా మారడంతో ఉపాధి కోల్పోయి తిండికి కష్టంగా మారిందని మరోకొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసి గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్లు వంటి అభివృద్ధి చేస్తుందేమో కానీ, ప్రజలు ఎలాంటి ఆర్థిక వృద్ధి సాధించలేని పరిస్థితి నెలకొంది. గ్రామాలు అభివృద్ధి చెందితేనే అభివృద్ధి కాదు, పేద ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే నిజమైన అభివృద్ధి. స్టేషన్ ఘన్‌పూర్ కొత్తగా మున్సిపాలిటీగా ఏర్పడడంతో ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పొందే కూలీలు నేడు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. నియోజకవర్గ కేంద్రమైన స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి, చాగల్లు గ్రామాలను కలుపుతూ గత జనవరి 25న మున్సిపాలిటీగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. దీంతో మూడు గ్రామాలకు చెందిన కొంతమంది తమ గ్రామాలు అభివృద్ధి చెందుతాయని సంతోషం వ్యక్తం చేశారు. కానీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా చేపట్టే ఉపాధి హామీ పథకం వర్తించకపోవడంతో కూలీలు ఉపాధి కోల్పోయారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో 2024-25 సంవత్సరంలో 31లక్షలతో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు జరిగితే 805 మంది ఉపాధి పొందారు. ఇందులో ఎస్సీలు 54.77 శాతం ఉన్నారు. శివునిపల్లిలో రూ.25 లక్షలతో పనులు జరిగితే 353 మంది ఉపాధి పొందగా, ఎస్సీలు 28.07 శాతం, చాగల్లు గ్రామంలో రూ.24లక్షలతో పనులు జరగగా 525 మందిలో ఎస్సీలు 43.72 శాతం ఉపాధి పొందారు. ఒక వ్యక్తి రోజుకు సుమారు రూ.260 సంపాదించేవారు. ఇలా వంద రోజుల్లో రూ.26వేలు సంపాదించేవారు. వాటిని దవాఖాన ఖర్చులు, ఇల్లు గడవడానికి ఉపయోగించుకునేవారు. అంతే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో ఎవరినైనా కూలీలు అప్పు అడిగితే ఉపాధి హామీ పనులకు పోయి తీరుస్తారనే నమ్మకంతో ఇచ్చేవారు. కానీ నేడు ఉపాధి హామీ కూలీలకు అప్పు కూడా పుట్టడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మూడు గ్రామాల్లో మొత్తం 2,936 జాబ్ కార్డులు ఉండగా కూలీలు 4,607 మంది ఉండేవారు. అందులో యాక్టీవ్ కూలీలు 1,687 కాగా, ఏడాదిలో వంద రోజులకు రూ.4.38కోట్ల ఉపాధి పొందేవారు. ప్రస్తుతం దీన్ని కోల్పోయారు. గ్రామాల అభివృద్ధితోపాటు వీరికి జీవనోపాధి కల్పించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### మాకు ఉపాధి కల్పించేలా చూడాలి



నా పేరు పసుల నాగరాణి, మా ఆయన పసుల శ్రీనివాస్ పెయింట్ వర్క్ చేస్తాడు. నేను నాలుగేళ్లుగా ఉపాధి హామీ పనులకు వెళుతున్నాను. వంద రోజులు కచ్చితంగా పనిచేస్తా. ఉపాధిహామీ పథకం ద్వారా సుమారు నెలకు రూ.6వేల వరకు వచ్చేది. దీంతో మా పిల్లల ఫీజు, ఇంటి ఖర్చులకు ఇబ్బంది లేకుండా ఉండేది. జనవరిలో స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీగా మారింది. ఇందుకు మేం సంతోష పడాలో, బాధపడాలో అర్థం కావడం లేదు. ఎందుకంటే మున్సిపాలిటీగా మారినప్పటి నుండి మా గ్రామంలో ఉపాధిహామీ పథకం తీసేశారు. మాకు పనులు కల్పించడం లేదు. దీంతో జీవనోపాధి కష్టంగా మారింది. మున్సిపాలిటీగా మారడం బాగానే ఉంది కానీ, మాలాంటి కూలీలకు కూడు లేకుండా పోయింది. ప్రభుత్వం, ఎమ్మెల్యే మా గురించి ఆలోచించి మాకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

– పసుల నాగరాణి, ఉపాధిహామీ కూలీ, స్టేషన్‌ఘన్‌పూర్

## నేడు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

జనగామ చౌరస్తా, మార్చి 26 : కొత్త రేషన్ కార్డులతో పాటు అన్ని రకాల పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం జరిగే ఈ ధర్నాను ప్రతి ఒకరూ విజయవంతం చేయాలని కోరారు.

## పశువుల, తై బజార్ వేలం

బచ్చన్నపేట, మార్చి 26 : మండల కేంద్రంలో పశువుల సంత, తైబజార్ వేలాన్ని పంచాయతీ కార్యాలయంలో డీఏవో రామారావు నాయక్, ఎంపీడీవో మల్లికార్జున్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పశువుల సంత వేలంలో మంచాల వినయ్ రూ.5.18లక్షలు, తై బజార్ వేలాన్ని దేవిని నగేశ్ రూ.2.55లక్షలకు, డక్కా వేలాన్ని మంచాల వివేక్ రూ.27వేలకు పాడి కైవసం చేసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి నర్సింహాచారి తెలిపారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

## కోలుకొండలో ఇఫ్తార్ విందు

దేవరుప్పుల, మార్చి 26 : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కోలుకొండలో మసీదు అధ్యక్షుడు మహ్మద్ ఖాసీం ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. గ్రామానికి చెందిన ముస్లింలు ఇందులో పాల్గొనగా రంజాన్ మాస విశిష్టతను రిజ్వాన్, ఫయాజ్ వివరించారు. కార్యక్రమంలో యాకూబ్ పాషా, రజాక్, అబ్దుల్లా, జాహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## దర్దేపల్లి శివారులో క్షుద్ర పూజల కలకలం

పాలకుర్తి, మార్చి 26 : మండలంలోని దర్దేపల్లి శివారులో క్షుద్ర పూజ కలకలం రేపింది. మంగళవారం అమావాస్య ఏకాదశి కావడంతో మంత్రాలు, తంత్రాలు, యంత్రాలతో క్షుద్ర పూజలు చేశారు. ఓ యువతిని గుర్తు తెలియని వ్యక్తులు నగ్నంగా పడుకోబెట్టి పూజలు చేశారు. గమనించిన పరిసర ప్రాంత రైతులు అక్కడికి చేరుకుని పూజ చేసేవారితో గొడవపడినట్లు సమాచారం. దీంతో వారు యువతితో సహా పరారైనట్లు తెలుస్తోంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు నిర్లక్ష్యంగా గంట తర్వాత వచ్చారని, వాగులో ప్రతి ఆదివారం, మంగళవారం ఇలానే క్షుద్ర పూజలు చేస్తున్నట్లు పక్క రైతులు తెలిపారు. అయినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమని వాపోయారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు.



కనకరాజును అభినందిస్తున్న గొల్ల,కురుమలు

## కళాకారుడికి సన్మానం

బచ్చన్నపేట, మార్చి 26 : బచ్చన్నపేట మండలం చిన్నరామచర్ల గ్రామానికి చెందిన కళాకారుడు కనకరాజుకు డాక్టరేట్ రావడంతో బుధవారం గొల్ల, కురుమ సంఘం మండల అధ్యక్షుడు జూకంటి కిష్టయ్య ఆధ్వర్యంలో అతడిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనకరాజు కళారంగంలో అందిస్తున్న సేవలకు చిన్న వయసులో డాక్టరేట్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, జేజాడి సిద్ధులు, ఒగ్గు బీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జంగిటి సిద్ధులు, చంద్రయ్య, బండారి అశోక్, కర్ణాకర్, అశోక్, రమేశ్, నర్సింహులు, మల్లయ్య, బీరయ్య, కనకయ్య పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



నివాళులర్పిస్తున్న యాదగిరి, శ్రీనివాసరావు తదితరులు

పాలకుర్తి, మార్చి 26 : వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి అన్నారు. పాశం యాదగిరి సహకారంతో డాక్టర్ హరికాంత్, డాక్టర్ సంధ్య కలిసి చాకలి ఐలమ్మ పోరాటంపై డాక్యుమెంటరీ రూపొందిస్తున్న సందర్భంగా పాలకుర్తిలో బుధవారం ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన ధీశాలీ ఐలమ్మ అని కొనియాడారు. ఐలమ్మ పోరాటం చరిత్రలోనే గొప్పదన్నారు. మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మపై డాక్యుమెంటరీ రూపొందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాచర్ల సారయ్య, కవి రచయిత డాక్టర్ రాపోలు సత్యనారాయణ, డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ, చిట్యాల యాకయ్య, రాపర్తి మంజుల, చిట్యాల సంపత్, శ్వేత, ఈదునూరి మదార్, గూడూరు లెనిన్, గుమ్మడిరాజుల సాంబయ్య, చిట్యాల కొండయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మల్లికార్జున్‌రావు

పాలకుర్తి, మార్చి 26 : వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌వో మల్లికార్జున్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎన్‌ఎంలు ప్రభుత్వ మార్గనిర్దేశాల మేరకు టార్గెట్‌లను పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు సిద్ధార్థరెడ్డి, ఉషా, ప్రభాకర్, ఇంద్రాణి, లిల్లిదేబోరా, రమణమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ప్రజలతో ఎల్‌ఆర్‌ఎస్ కట్టించాలి



కార్యదర్శులు, ఎఫ్‌ఏలకు ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను అందజేస్తున్న ఎంపీడీవో నాగశేషాద్రి సూరి

కొడకండ్ల, మార్చి 26 : తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ విధానాన్ని గ్రామాల్లో ప్రజలకు వివరించి, ప్లాట్లు ఉన్నవారితో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కట్టించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నాగశేషాద్రి సూరి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యాదర్శులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పనులకు రోజు 100 మంది కూలీలు వచ్చేలా చూడాలన్నారు. వర్క్ సైట్‌లో నీడ ఉండేలా, మంచినీళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. మార్చి 31లోపు మెటీరియల్ పేమెంట్స్ టార్గెట్ ప్రకారం పూర్తి చేయాలని, అలాగే, తాగు నీరు సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. అనంతరం కార్యదర్శులు, ఫీల్డ్ అసిసెంట్లకు ఎంపీడీవో చేతుల మీదుగా ప్రథమ చికిత్స బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో ఇందిర, ఏపీవో కుమారస్వామి పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై దర్యాప్తు చేపట్టాలి

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 26 : హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ రె. పగడాల ప్రవీణ్ మృతి మతోన్మాదుల దుశ్చర్యగా భావిస్తున్నామని, ఆయన మృతిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని స్టేషన్ ఘన్‌పూర్ మండల పాస్టర్లు కోరారు.ప్రవీణ్ మృతి పట్ల మండలంలోని ఫాస్టర్స్, క్రిష్టియన్ ఫెలోషిప్ సభ్యులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ప్రవీణ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫాస్టర్స్ మండల అధ్యక్షుడు కందుకూరి దేవవరం, ఉపాధ్యక్షుడు ఎన్ టెక్నా మాట్లాడుతూ పగడాల ప్రవీన్ అనుమానస్పద మృతిపై విచారణ చేపట్టి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేసీ జాన్ బన్ని, వెంకటస్వామి, ఎం బాలస్వామి, సింగపురం వెంకటయ్య, థామస్, లక్ష్మణ్, విజయకుమార్, ఆనందం, చంద్రయ్య పాల్గొన్నారు.

## మున్సిపల్ ఆఫీస్‌లో విద్యుత్ బిల్లుల కౌంటర్

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 26 : విద్యుత్ బకాయిల చెల్లింపు కోసం డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు చేసినట్లు డీఈ రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యహ్నం రెండు గంటల వరకు బిల్లులు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు తమ బకాయిలను సరైన సమయంలో చెల్లించి అపరాధ రుసుములు పడకుండా చూసుకుని, సంస్థకు సహకరించాలని ఆయన కోరారు.

## కలెక్టరేట్ హెలీప్యాడ్ వద్ద చెలరేగిన మంటలు



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

జనగామ చౌరస్తా, మార్చి 26 : జనగామ కలెక్టరేట్‌కు సమీపంలో ఉన్న హెలీప్యాడ్ వద్ద బుధవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. హెలీప్యాడ్ చుట్టున్న ఖాళీ స్థలంతో పాటు పక్కనే ఉన్న నర్సరీలోకి దట్టమైన పొగలతో మంటలు వ్యాపించి చెట్లు దగ్ధమయ్యాయి. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ ఎస్టేట్ ఆఫీసర్ మౌనిక వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ సాయంతో కలెక్టరేట్ హెలీప్యాడ్ వద్దకు చేరుకున్న సిబ్బంది మంటలు వ్యాపించకుండా అరికట్టారు. ఘటనా స్థలాన్ని అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీసీ సత్యపాల్, కలెక్టరేట్ సూపర్‌వైజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ‘పది’ పరీక్షలు

- 4వ రోజు 99.92 హాజరు శాతం నమోదు
- జిల్లావ్యాప్తంగా ఐదుగురు విద్యార్థుల గైర్హాజర్

జనగామ చౌరస్తా, మార్చి 26 : పదో తరగతి వార్షిక పరీక్షలు బుధవారం జనగామ జిల్లాలో ప్రశాంతంగా కొనసాగాయి. 4వ రోజు జిల్లాలోని 41 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన గణితం పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 6238 మంది హాజరుకావాల్సి ఉండగా, 6233 మంది హాజరైనట్లు డీఈవో ఎం రమేశ్ తెలిపారు. ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. అలాగే, ప్రైవేట్ (ఒకసారి ఫెయిలైన) విద్యార్థులు ఇద్దరికి గాను ఇద్దరు హాజరైనట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 99.92 హాజరు శాతం నమోదైనట్లు వెల్లడించారు. రాష్ట్ర పరిశీలకుడు ఎస్ శ్రీనివాసచారి జఫర్‌గఢ్ జడ్పీహెచ్‌ఎస్, టీజీఎంఎస్, పాలకుర్తి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ జనగామ జిల్లా కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 7 పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.



చిన్నపెండ్యాలలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య

## మృతుడి కుటుంబానికి రాజయ్య పరామర్శ

చిల్పూరు, మార్చి 26 : మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన జింక రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం దశదినకర్మ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామార్శించి, ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దేవస్థానం మాజీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, మోటం రాములు, గడ్డమీది మహేందర్, అశోక్, అరుణ్, శంకర్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

## కాలంచెల్లినవి విక్రయిస్తున్నారని..

### సూపర్ మార్కెట్ ఎదుట ధర్నా

జనగామ చౌరస్తా, మార్చి 26 : గడువు దాటిన తినుబండారాలను విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ జనగామ నెహ్రూపార్క్ రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ ఎదుట సీపీఎం నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బూడిద గోపి, జోగు ప్రకాశ్ మాట్లాడుతూ మంగళవారం చీటకోడూరు గ్రామానికి చెందిన బండారి లక్ష్మణ్ మోర్ సూపర్ మార్కెట్‌లో ‘యోగా బార్ ఫ్రూట్స్ అండ్ నట్స్ సీడ్స్’ ప్యాకింగ్ ఫుడ్ ఐటెమ్‌ను వారి పిల్లల కోసం కొనుగోలు చేశాడని తెలిపారు. ఇంటి దగ్గర వాటిని తిన్న పిల్లలు అనారోగ్యానికి గురికావడంతో అనుమానం వచ్చి ప్యాకింగ్ కవర్‌ను పరిశీలించగా మార్చి 19 వరకే గడువు ఉండడం గమనించి, బుధవారం ఉదయం మోర్ సూపర్ మార్కెట్ నిర్వాహకులను నిలదీసినట్లు తెలిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సూపర్ మార్కెట్ యాజమాన్యంపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు, మున్సిపల్ ఉద్యోగులు వచ్చి తాత్కాలికంగా సూపర్ మార్కెట్‌ను మూసివేశారు. సీపీఎం నాయకులు భూక్యా చందు, బొట్ల శ్రావణ్, శ్రీకాంత్, ప్రశాంత్, మహేందర్, సంపత్, యాకన్న, మల్లేశ్ రాజ్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న గడ్డం రాజుగౌడ్

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

చిల్పూరు, మార్చి 26 : మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ నరేశ్ ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందగా బుధవారం తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజు గౌడ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్టాపురం ఏకాంతం గౌడ్, తీగల లక్ష్మణ్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి జనగాం వెంకటేశ్వర్లు గౌడ్‌తో కలిసి రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి గోపి గౌడ్, బీఆర్‌ఎస్ జనగామ జిల్లా నాయకుడు జనగాం యాదగిరి గౌడ్, శ్రీపతిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కొయ్యడ రామదాసు గౌడ్, సారా వెంకటయ్య గౌడ్, తాళ్లపల్లి జగన్నాథం గౌడ్, రంగు రమేశ్‌గౌడ్, రంగు హరీశ్‌గౌడ్, తండ వెంకన్న గౌడ్, సొసైటీ అధ్యక్షుడు తండా యాదగిరి గౌడ్, కోయడ చంద్రమౌళి గౌడ్, ముత్యం రాజుగౌడ్, బత్తిని సాంబరాజు పాల్గొన్నారు.



మాధాపురం పాఠశాలలో వాటర్ ప్యూరిఫైర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో కళావతి

## స్వచ్ఛమైన నీటితో రుగ్మతలకు పరిష్కారం

దేవరుప్పుల, మార్చి 26 : దేశంలో ప్రజలకు అత్యధిక రుగ్మతలు కలుషిత నీరు తాగడం వల్లనే వస్తున్నాయని, స్వచ్ఛమైన నీరు తాగడమే దీనికి పరిష్కారమని మండల విద్యాధికారి కళావతి అన్నారు. మాధాపురం ప్రాథమిక పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2 లక్షలు వెచ్చించి విద్యార్థుల కోం వాటర్ ప్లాంట్ నెలకొల్పగా బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించడం అభినందనీయమన్నారు. హెచ్‌ఎం నల్ల లలిత మాట్లాడుతూ వినయ్ తుమ్మలపల్లి తన తల్లి జ్ఞాపకార్థం ఫౌండేషన్ ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధి శ్రీనును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణు, ఉపాధ్యాయులు జీవన్, సుర్జీత్, అంగన్‌వాడీ టీచర్లు విజయ, రజిత, కృషి, అంబేద్కర్ యూత్ అసోసియేషన్ల అధ్యక్షులు సతీశ్, అభిషేక్ పాల్గొన్నారు